క్లుప్తంగా

రైల్వే న్యాయ సలహాదారుడికి సత్కారం



సత్తెనపల్లి: సౌత్ సెంట్రల్ రైల్వే న్యాయ సలహాదారుడిగా నియమితులైన సత్తెనపల్లికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉల్లం శేషగిరిరావును శుక్రవారం న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సబ్ కోర్టు పీపీ బగ్గి నరసింహరావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, న్యాయ విద్యార్థి బగ్గి శ్రీకమల్, జూనియర్ న్యాయవాదులు ఊశిరికాయల సాంబశివరావు, కోటగిరి లక్ష్మణ్, నర్రా శ్రీనివాసరావు, మాచర్ల మహేశ్వరి ఉన్నారు.

టీపీఎస్ బదిలీ

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సునీత టీపీఓగా పదోన్నతి పొందారు. ఆమెను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడటంతో శుక్రవారం నుంచి రిలీవ్ అయ్యారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 తాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం వి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు రోజూ రెండు కిలోమీటర్ల దూరం నుంచి నడిచి పాఠశాలకు వస్తున్నట్లు తెలిపారు. సైకిళ్ల విలువ సుమారుగా రూ.20వేలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్థలదాత జి.బలరామ కృష్ణంరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ వాసా భద్రయ్య, వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు పాల్గొన్నారు.

పని భద్రత కల్పించాలి



పెదకూరపాడు: హమాలీ కూలీలకు పని భద్రత కల్పించాలని నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సివిల్ సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద శుక్రవారం హమాలీలతో కలిసి నిరసన తెలిపారు. పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలకు కమిషన్ ప్రతి నెలా 10వ తేదీలోపు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా పనిలో చేరిన వారికి పీఎఫ్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తేల ప్రసాద్, సుధాకర్, చిన్ని రతన్ రాజు, శేఖర్, హమాలీలు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా సుభాషిణి



రాజుపాలెం: బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్ బిట్ర సుభాషిణి సర్పంచ్‌గా పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ ఓర్సు వెంకటపతి ఆరోగ్య రీత్యా సెలవు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, ఓర్సు వెంకటపతి, బిట్ర రాజశేఖర్, గ్రామపెద్దలు ఉన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



రాజుపాలెం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఆర్.రమేష్‌బాబు అన్నారు. పెద నెమలిపురిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్ పరిశీలించారు. గ్రామ సచివాలయంలో రికార్డులను, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంఈవో మల్లికార్జునశర్మ, ఈవో పిఆర్‌డీ పగడాల ముక్కంటి పాల్గొన్నారు.

కూటమొచ్చింది..బీమా పోయింది

కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసింది. సూపర్ సిక్స్‌లోని అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామన్న రూ.20వేల సాయానికి ఎగనామం పెట్టింది. రైతు సేవ కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఇంతవరకు పంపిణీ కాలేదు. పండిన పంటకు మద్దతు ధరా లేదు. ఇవన్నీ చేయకపోగా ప్రకృతి వైపరీత్యా వల్ల పంటలు కోల్పోయిన రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఉచిత బీమా పథకాన్ని.. అటకెక్కించేసింది.



కోగంటివారిపాలెంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

- ఉచిత బీమాకు మంగళం పాడిన ప్రభుత్వం
- ప్రీమియం చెల్లింపు భారం రైతులపైనే
- బీమాకు ఒక్కరూ ముందుకు రాని వైనం
- గతంలో రైతుల ప్రీమియం చెల్లించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

అచ్చంపేట: విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు అనేక కష్టనష్టాలకోర్చి, ఆటుపోట్లను ఎదుర్కొంటారు. అలాగే చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నేలపాలు అవుతుంటుంది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతుల పక్షాన నిలబడింది. పంట ఆరంభం నుంచి కోత వరకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అన్ని విధాలా అండగా నిలిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలకు తల్లడిల్లే రైతులను ఆదుకునేందుకు వినూత్న ప్రయోగం చేసింది. మొదటి ఏడాది ఒక్క రూపాయి చెల్లించి పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికి అయిదేళ్ల పాటు బీమా వర్తించే విధంగా వైఎస్సార్ ఉచిత బీమా పథకాన్ని తీసుకువచ్చింది. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రతి ఏటా ప్రభుత్వమే రైతుల తరుపున చెల్లించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఈ పథకాన్ని ఎత్తేసింది.

ప్రీమియం భారం మొత్తం రైతులపైనే..

కుటమి సర్కారు కొలువదీరిన తర్వాత పంటల బీమా ప్రీమియం భారం మొత్తం రైతులపైనే వేసింది. ఎకరాకు రూ.580 ప్రీమియంగా నిర్ణయించింది. ఈ నెల 17వ తేదీ తుది గడువుగా ప్రకటించింది. కానీ, బీమా ప్రీమియాన్ని చెల్లించేందుకు ఒక్క రైతు కూడా ముందుకు రాలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అనుకోని పరిస్థితులు కారణంగా సాగులో ఉన్న పంట నష్టం జరిగితే రైతులకు దిక్కెవరన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ ఏడాది పత్తి దెబ్బతింది. మిర్చి తెగుళ్ల బారిన పడింది. పండిన పంటకు కూడా మద్దతు ధర లేదు. రైతులు పూర్తిగా సంక్షోభంలో కూరుకు పోయారు.

ఇకపై ఉచిత బీమా అనుమానమే

పెదకూరపాడు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా సాగుభూములుంటే అందులో సుమారు 60 వేల ఎకరాల్లో 10 వేలకు పైగా రైతులు రబీ పంటలుగా వరి, జొన్న, మొక్కజొన్న, పొగాకు, పుల్ల శనగ, నువ్వులు, కంది, మినుము తదితర పంటలు వేశారు. అచ్చంపేట మండలంలో 22 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా సుమారు 10వేలకు పైగా ఎకరాల్లో 2 వేల మంది రైతులు రబీ పంటలు వేశారు. వీరంతా గడువు ముగిసే నాటికి కూడా బీమా ప్రీమియం చెల్లించక పోవడంతో వచ్చే నాలుగేళ్ల ఖరీఫ్, రబీ పంట సీజన్లలో కూడా రైతులకు పంట బీమాలు లేనట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బీమా అమలు చేయాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉచిత బీమా పథకంతో రైతులకు భరోసా కల్పించింది. తుఫాన్లకు పంట నష్టపోయిన రైతులందరికి బీమా చెల్లించారు. కూటమి సర్కార్ కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తే బాగుంటుంది.

– మర్యాద శ్రీనివాసరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది పంటలకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. రబీ సీజన్‌లోనైనా రైతుల పక్షాన ప్రభుత్వం ఉచిత బీమా ప్రీమియం చెల్లించి, పథకాన్ని కొనసాగించాలి. రైతులకు అండగా ఉండాలి.

– అనుముల సాంబిరెడ్డి, రైతు, రుద్రవరం

ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు

ఖరీఫ్‌కు ముందే ఎకరాకు రూ.580 ప్రీమియం చెల్లించి, బీమా చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాం. అయినా అచ్చంపేట మండలంలో ఒక్క రైతు కూడా ప్రీమియం చెల్లించలేదు. ఉచిత బీమా పథకంపై ఎలాంటి సమాచారం లేదు.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

విద్యార్థుల గైర్హాజరుపై చర్యలు



ముప్పాళ్ళ: నెలరోజులు పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులను తరగతి నుంచి తొలగించాలని మండల ప్రత్యేకాధికారి కాంతారావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. 30 రోజులు దాటి పాఠశాలకు రాని విద్యార్థులు నలుగురు ఉన్నట్లుగా గుర్తించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని హెచ్‌ఎం కె.నాగేంద్రమ్మకు సూచించారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చేందుకు తీసుకుంటున్న చర్యలపైన పలు సూచనలు చేశారు. ఎంఈఓ–2 సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

సత్తెనపల్లి: సెలవు రోజుల్లోనూ పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు వెలుపడినట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో పదో తరగతిలో మంచి ఫలితాల కోసం ఎస్సీఈఆర్టీ 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 10వ తేదీ మధ్య రెండు రెండో శనివారాలు, ఆరు ఆదివారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ తేదీల్లోనూ విద్యార్థులు పాఠశాలలకు రావాల్సి ఉంటుందని, అందుకే ఆయా రోజుల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. పాఠశాలల్లో శనివారం నడిచే మెనూను పెట్టాలని, సోమవారం మెనూనే ఆదివారం అందించాలని తెలిపారు.

వాడీవేడిగా అచ్చంపేట సర్వసభ్య సమావేశం

- పీహెచ్‌సీ భవనంలో సిబ్బంది కొరతపై ఆగ్రహం
- మధ్యాహ్నభోజనం అధ్వానంగా ఉందంటూ వేడుకోలు
- అధికారులను ప్రశ్నించిన ప్రజా ప్రతినిధులు



మధ్యాహ్న భోజనంలో పురుగులొస్తున్నాయని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ నటరాజు

అచ్చంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మండలంలో ఏదైనా ప్రమాదం జరిగి తీవ్ర గాయాలతో వైద్యశాలకు వస్తే కనీసం రెండు కుట్లు వేయడానికి కూడా ఎవరూ లేరని, ప్రతి వైద్యానికి సత్తెనపల్లి రిఫర్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్ల వ్యయంతో పీహెచ్‌సీ భవనం నిర్మించి, అత్యాధునిక సౌకర్యాలు కల్పించారని, ఒక్క గైనకాలజిస్ట్ కూడా లేదని చెప్పారు. ఆపరేషన్ చేసి డెలివరీ చేసే దిక్కు లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నొప్పులెక్కువై గర్భిణులు వైద్యశాలకొస్తే ఏం చేస్తారని చిగురుపాడు సర్పంచ్ రామకృష్ణ వైద్యాధికారి ఇన్నారావును, ఇతర అధికారులను ప్రశ్నించారు. తమ గ్రామంలో మంచి నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నామని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని చెప్పారు. కోనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు ప్రశ్నించారు. చింతపల్లి నుంచి పైపు లైను ద్వారా వచ్చే సీపీడబ్ల్యూఎస్ స్కీం పనిచేయడం లేదని, గ్రామంలో మంచినీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, ఇంకెన్నాళ్లు ఈ బాధను అనుభవించాలని కోగంటివారి పాలెం సర్పంచ్ బోనం నాగిరెడ్డి ప్రశ్నించారు. వేల్పూరులో మంచినీటి చెరువుకు ఫెన్సింగ్ వేయాలని, చెరువులో చెత్తాచెదారం పేరుగుపోయిందని సర్పంచ్ జువ్వా శంకర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని హౌసింగ్ ఏఈ వినోద్‌ను సభ్యులు ప్రశ్నించారు. రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖల అధికారుల గొర్హాజరుపై సభ్యులు మండిపడ్డారు. అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు సభ్యులకు సమాధానమిచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల 3 నెలల పురోగతిని వివరించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పుల్లారెడ్డి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

మాదల(ముప్పాళ్ళ): మాదల, కుందురువారిపాలెం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. ఆయా శిబిరాల్లో మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. 34 సాధారణ చికిత్సలు, 27 గర్భకోశ పరీక్షలు, 21 కృత్రిమ గర్భధారణ, 20 చూడి పరీక్షలు, 150 దూడలకు నట్టల నివారణ మందు, 480 గొర్రెలకు బొబ్బ టీకాలు అందించినట్లు పుల్లారెడ్డి తెలిపారు. కుందురువారిపాలెం శిబిరాన్ని సర్పంచ్ చయికం వెంకటప్పారెడ్డి, మాదలలో ఉప సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు ప్రారంభించారు.

దేవరంపాడులో పశువైద్య శిబిరం

రాజుపాలెం: దేవరంపాడులో పశువైద్య శిబిరం శుక్రవారం జరిగింది. పశువైద్యాధికారి కె.నాగేశ్వరరావు పశువులకు వైద్య సేవలు అందించారు. 40 పశువులకు సాధారణ, 17 పశువులకు గర్భకోశ, 20 పశువులకు సూడు పరీక్షలు, 32 పశువులకు, 40 లేగ దూడలకు నట్టల నివారణ మందు పంపణీ చేశారు. 100 గొర్రెలు, మేకలకు బొబ్బ టీకాలు వేశారు. అనంతరం పశువులకు సోకే వ్యాధులపై వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు అఖిల, జగన్‌మోహన్ రావు, రాజేష్, శిరీష పాల్గొన్నారు.

27 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

క్రోసూరు: మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు ఈ నెల 27 నుంచి పునఃప్రారంభమవుతాయని మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులవారిపాలెం, హసనాబాద్, నాగవరం, 88త్యాళ్లూరు, ఉయ్యందన, పీసపాడు, పారుపల్లి, బాలెమర్రులో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట: పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. వేల్పూరులో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యులు జువ్వా శంకర్, వెంకాయమ్మ ప్రారంభించారు. 320 పశువులు, 100 దూడలకు నట్టల నివారణ మందు, 160 జీవాలకు బొబ్బర టీకా వేసినట్లు డాక్టర్ తెలిపారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్



న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: పొన్నూరు న్యాయవాది భేతాల ప్రకాష్‌పై చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జరుగుతున్న బాయ్‌కాట్‌ను శుక్రవారం న్యాయవాదులు కొనసాగించారు. విధులు బహిష్కరించి తాలూక న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద పరిరక్షణ చట్టాలు అమలు చేయాలన్నారు. న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, మద్దినేని వెంకటచలపతిరావు, బుతుకూరి రామిరెడ్డి, మన్నెం వెంకటేశ్వరరావు, ఆకుల నాగార్జున, యేసురత్నం, విజయభరత్, నయన, రాజవరపు నరసింహారావు, తవ్వా హరనాథ్, బాదినేడి శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త భార్గవ్‌రెడ్డికి సత్కారం



సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డిని పార్టీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి వెలుగూరి శరత్, పార్టీ నాయకులు గుంటూరు జానీ, జూపల్లి పాల్ ఉన్నారు.

రామ భూవర శతకం గ్రంథ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రామ భూవర శతకం గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభా పరిచయం ఉపాధ్యాయుడు గుండ్లపలి కృష్ణ చేశారు. డాక్టర్ జీఆర్ చంద్రశేఖర్, డాక్టర్ గిరిజ దంపతులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అధ్యక్షత వహించారు. సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ప్రార్థన చేశారు. పద్య కళానిధి డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి గ్రంథ ఆవిష్కరణ, మధుర వక్త డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి గ్రంథ పరిచయం చేశారు. నకరికల్లు మండలం గుండ్లపల్లిలోని సీతా రామ చంద్ర స్వామి పాదాలకు అంకితమిచ్చేలా రామ భూవర శతకంను గుండ్లపల్లి వేంకట హనుమంతరావు రచించారు. విశ్రాంత ఉపాధ్యాయులు పోలూరి వేంకట శివ రామ ప్రసాదరావు, మంచికంటి వేంకటేశ్వరరావు, విశ్రాంత కరణం గిరిరాజు శేషగిరిరావు మాట్లాడారు. డాక్టర్ గుండ్లపల్లి శ్రీకాంత్ వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో గుండ్లపల్లి విజయలక్ష్మి, డాక్టర్ గుండ్లపల్లి ఫణి ప్రశాంతి, గుండ్లపల్లి సంధ్య పాల్గొన్నారు.

చికెన్ దుకాణం దొలగించాలని ఆందోళన

నకరికల్లు: స్థానిక మీ–సేవ పక్కన ఉన్న చికెన్ దుకాణం తొలగించాలని మీ–సేవ నిర్వాహకుడు, బీజేపి మండల కార్యదర్శి మునవ్వర్ బాజి శుక్రవారం ఆందోళన చేశారు. చికెన్ దుకాణం నుంచి దుర్వాసన వస్తోందని తెలిపారు. బీజేపి నాయకుడు శ్రీనివాసరావుతో కలిసి దుకాణం వద్ద బైఠాయించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కంప్యూటర్ వితరణ



నకరికల్లు: విద్యా రంగానికి చేసిన సేవ తరతరాలు నిలుస్తుందని ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన గల ఎంపీపీ మెయిన్ పాఠశాలకు నరసరావుపేట ఐడీబీఐ బ్యాంకు తరపున రూ.60 వేల విలువ కలిగిన కంప్యూటర్, ఫర్నీచర్‌ను శుక్రవారం అందజేశారు. బ్యాంకు తరపున నరసరావుపేట శాఖ మేనేజర్ భవ్య భారతి, మంగళగిరి మేనేజర్ కామేశ్వరరావు, అధికారి పవన్ ప్రధానోపాధ్యాయునికి అందజేశారు.

బాలిక భారం కాదు.. బంగారు భవిష్యత్తు



బాలికలను సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



బెల్లంకొండలో బాలికలు, అధికారుల ర్యాలీ

పెదకూరపాడు: కుటుంబానికి బాలిక భారం కాదని, బంగారు భవిష్యత్తు అందించే శక్తి అని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాల బాలికలతో ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ బాలికలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. పురుషులతో సమానంగా ఆడబిడ్డలకు విద్యా, వైద్యం, పౌష్టికాహారం సమాన హక్కులు కల్పించాలని కోరారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయుడు కేవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- బెల్లంకొండ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలిక దినోత్సవం నిర్వహించారు. ఆయుష్ వైద్యుడు డాక్టర్ ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. వివక్ష లేని సమాజాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు వనజ, పరిమళ, షేక్ మున్ని, నాగేంద్రం, ప్రధానోపాధ్యాయురాలు శాంతి, పార్వతి పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రీ

సత్తెనపల్లి: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సుగాలీ కాలని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి మాట్లాడుతూ బాలికలు ఉన్నతంగా రాణించేందుకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. బాలికల భద్రత కోసం పట్టణంలోని పలు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.
బాలికల భద్రత, బాల్యవివాహాలు, పౌష్టికాహారం, రక్త హీనత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆసియా, ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల, హెచ్‌ఎం ప్రియదర్శిని, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదకూరపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నరసరావుపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 75త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరిచారు. పాటల పోటీలో ఇ.అక్షయ, జె.బ్లెస్సీ ప్రథమ స్థానం, క్విజ్‌లో కె.హేమంత్‌రెడ్డి, సీహెచ్ అశోకరెడ్డి బృందం ద్వితీయ స్థానం, డిబేట్‌లో కె.దివ్య తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులకు శనివారం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాలులో జరిగే కార్యక్రమంలో ఉన్నత అధికారులు బహుమతులు ప్రదానం చేయనున్నారు. శిక్షణనిచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె.కోటేశ్వరరావు, ఎస్.రమేష్‌ను ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పున్నారావు అభినందించారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ, సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.